# వైద్య కళాశాలలపై కూటమి కుట్రలు

- పేదలకు వైద్యవిద్యను దూరం చేసే యత్నాలపై సమష్టిగా పోరాడుదాం
- ప్రజా ఉద్యమంలా కోటి సంతకాల సేకరణ
- వైఎస్సార్‌సీపీ భీమిలి సమన్వయకర్త చిన్న శ్రీను పిలుపు
- భీమిలి, ఆనందపురం మండలాల్లో విస్తృత సమావేశాలు


ఎండాడలోని వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో కోటి సంతకాల సేకరణ పోస్టర్ ఆవిష్కరిస్తున్న భీమిలి నియోజకవర్గ సమన్వయకర్త మజ్జి శ్రీనివాసరావు, తదితరులు

కొమ్మాది: ప్రభుత్వ వైద్య కళాశాలలపై కూటమి ప్రభుత్వం కుట్రలు పన్నుతోందని వైఎస్సార్‌సీపీ భీమిలి నియోజకవర్గ సమన్వయకర్త మజ్జి శ్రీనివాసరావు (చిన్న శ్రీను) అన్నారు. ఎండాడలోని వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో గురువారం నిర్వహించిన భీమిలి మండల, వార్డుల విస్తృత సమావేశంలో ఆయన మాట్లాడారు. పేదలకు వైద్య విద్యను, మెరుగైన వైద్యాన్ని అందుబాటులోనికి తీసుకువచ్చేందుకు వైఎస్సార్‌సీపీ హయాంలో అప్పటి సీఎం వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి రాష్ట్రవ్యాప్తంగా 17 మెడికల్ కళాశాలలకు శ్రీకారం చుట్టారన్నారు. అందులో 10 కళాశాలలను కూటమి సర్కార్ పీపీపీ పద్ధతిలో ప్రైవేటుపరం చేసేందుకు సిద్ధమైందని, ఈ నిర్ణయం వలన పేద, మధ్య తరగతి విద్యార్థులు వైద్య విద్యకు దూరమవుతారని ఆందోళన వ్యక్తం చేశారు. ఈ నేపథ్యంలో ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా వైఎస్సార్‌సీపీ చేపడుతున్న కోటి సంతకాల సేకరణను ఒక ప్రజా ఉద్యమంలా నిర్వహించాలని పార్టీ శ్రేణులకు ఆయన పిలుపునిచ్చారు. వైద్యకళాశాలల ప్రైవేటీకరణ నిర్ణయాన్ని రాష్ట్ర ప్రజలు వ్యతిరేకిస్తున్నారన్నారు. కోటి సంతకాలతో కూటమి కోటలకు బీటలు వారడం ఖాయమన్నారు.

**ఇది ప్రజా సమస్య**

సమావేశంలో భీమిలి నియోజకవర్గ పరిశీలకులు తైనాల విజయ్‌కుమార్ మాట్లాడుతూ మెడికల్ కళాశాలల ప్రైవేటీకరణ ప్రజా సమస్య అని అన్నారు. ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా నిర్వహిస్తున్న కోటి సంతకాల సేకరణకు పార్టీలకు అతీతంగా ప్రజలు భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. రాష్ట్ర ప్రజలు ఇప్పుడు మేలుకోకుంటే భవిష్యత్తులో పేద, మధ్య తరగతి యువతకు వైద్య విద్య దూరంగా, భారంగా మారుతుందని హెచ్చరించారు. ఈ కోటి సంతకాల సేకరణలో భాగంగా నిర్వహిస్తున్న ఈ ఉద్యమంలో భీమిలి నియోజకవర్గం నుంచి లక్ష సంతకాలు సేకరించాలన్నారు. కార్యక్రమంలో భీమిలి ఎంపీపీ దంతులూరి వాసు రాజు, ఎస్ఈసీ మెంబర్లు దాట్ల వెంకట అప్పల ప్రసాదరాజు, పోతిన హనుమంతు, కార్పొరేటర్ దొలపల్లి కొండబాబు, వైస్ ఎంపీపీ బోని బంగారు నాయుడు, మండల అధ్యక్షులు గాడు శ్రీను, వార్డులు, వివిధ విభాగాల అధ్యక్షులు గుడ్ల పోలిరెడ్డి, పోతిన శ్రీనివాసరావు, పోతిన ప్రసాద్, బొట్టా అప్పలరాజు, జగ్గుపిల్లి ప్రసాద్, వంకాయల మారుతి ప్రసాద్, పిల్లా సూరిబాబు, పాల రమణారెడ్డి, చిల్లా కరుణాకర్‌రెడ్డి, జీరు వెంకటరెడ్డి, అక్కరమాని రామనాయుడు, గాదె రోశిరెడ్డి, అక్కరమాని మంగరాజు, పోతిన ఎల్లాజీ, జీఎస్ రెడ్డి, పిల్లా రమణ, అల్లిపిల్లి నర్సింగరావు, జి. మధు, వేముల ఈశ్వర్‌రెడ్డి, వైఎస్ మూర్తి, దాసు, దుర్గారావు, సుజాత, పద్మావతి, రజిని, మేరుగు చిన్నారావు, రాములప్పడు, ఇతర ముఖ్య నాయకులు పాల్గొన్నారు.

**కల్తీ, ప్రైవేటు ప్రభుత్వం**

రాష్ట్రంలో ప్రస్తుతం ఎక్కడ చూసినా సమస్యలే కనపడుతున్నాయని చిన్నశ్రీను అన్నారు. ఒకవైపు కల్తీ మద్యంతో ప్రజల ఆరోగ్యంతో ఆటలు ఆడుతూ.. మరో వైపు ప్రభుత్వ ఆస్తులను ప్రైవేటుపరం చేస్తూ రాష్ట్ర ప్రజలను ఆందోళనకు గురి చేస్తున్నారన్నారు. ఇది కూటమి ప్రభుత్వం కాదని, కల్తీ, ప్రైవేటు ప్రభుత్వం అని అన్నారు. కూటమి పాలనలో మహిళలకు రక్షణ లేదని, గిరిజన హాస్టల్స్‌లో వసతులు లేవని, రాష్ట్రంలో ఎక్కడా సరైన రోడ్లు లేవని, నిరుద్యోగ యువకులకు ఉద్యోగాలు లేవని గుర్తు చేశారు. కానీ దేశంలో ఏ రాష్ట్రంలో జరగని అభివృద్ధి జరుగుతోందని గ్రాఫిక్స్ మాయాజాలంతో ప్రచారం చేస్తూ, రాష్ట్ర ప్రజలను నమ్మించే ప్రయత్నం చేస్తున్నారన్నారు. విశాఖపట్నానికి సాఫ్ట్‌వేర్ కంపెనీలు, డేటా సెంటర్లు వచ్చేస్తున్నాయని ప్రచారం చేస్తున్నారే తప్ప, స్థానిక యువతకు ఎటువంటి భరోసా లేదన్నారు.

**ప్రైవేటీకరణ యత్నాలను కోటి సంతకాలతో నిలువరిద్దాం**

తగరపువలస: వైద్యకళాశాలల ప్రైవేటీకరణ యత్నాలను కోటి సంతకాలతో నిలువరిద్దామని వైఎస్సార్‌సీపీ భీమిలి సమన్వయకర్త మజ్జి శ్రీనివాసరావు అన్నారు. ఆనందపురం మండలం వేములవలసలో గురువారం సాయంత్రం జెడ్పీటీసీ సభ్యుడు కోరాడ వెంకటరావు ఇంటి వద్ద మండల పార్టీ కార్యకర్తలు, నాయకుల సమావేశంలో ఆయన మాట్లాడారు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వహయాంలో రాష్ట్రంలో పేదలకు సూపర్ స్పెషాలిటీ వైద్యసేవలు, వైద్యవిద్య అందించేందుకు 17 మెడికల్ కళాశాలల ఏర్పాటుకు శ్రీకారం చుట్టగా, వీటిలో ఐదు పూర్తి చేయగా మరో రెండు ప్రారంభానికి సిద్ధంగా ఉన్నాయన్నారు. పేదలకు వైద్యం, విద్య అందించడానికి సిద్ధంగా లేని కూటమి ప్రభుత్వం వీటిని ప్రైవేటీకరణ చేసే దిశగా చేస్తున్న ప్రయత్నాలను కోటి సంతకాల సేకరణ ద్వారా నిలువరించాలన్నారు. దీనిని రాజకీయ కోణంలో చూడకుండా ప్రతి ఒక్కరూ సామాజిక బాధ్యతగా కదలాలన్నారు. కూటమి ప్రభుత్వం 16 నెలల కాలంలో రూ.2.35 లక్షల కోట్లు అప్పులు చేసిందన్నారు. అంటే నెలకు రూ.15వేల కోట్లన్నారు. అదే ఏడాదికి రూ.1000 కోట్లు ఖర్చు చేస్తే ఐదేళ్లలో పది మెడికల్ కళాశాలలు పూర్తి చేస్తే, కేజీహెచ్ వలె సేవలు అందించవచ్చన్నారు.


వేములవలసలో ఆనందపురం మండల నాయకుల సమావేశంలో మాట్లాడుతున్న చిన్న శ్రీను

## నెలాఖరులోగా గ్రామ కమిటీల ఏర్పాటు

పార్టీలో కార్యకర్త స్థాయి నుంచి పెద్దపీట వేయడానికి గాను ఈ నెలాఖరులోగా ప్రతి గ్రామం నుంచి ఏడుగురు సభ్యులతో కమిటీ వేయాలని వైఎస్ జగన్ ఆదేశించారన్నారు. వీటిలో మహిళలు, యువకులు, బీసీ, ఎస్సీ, ఎస్టీ, సోషల్ మీడియా తదితర వర్గాలకు ప్రాధాన్యత ఇవ్వాలన్నారు. కార్యక్రమంలో జిల్లా కార్యదర్శి గంట్రెడ్డి శ్రీనివాస్, పార్టీ మండల అధ్యక్షుడు బంక సత్యం, వర్కింగ్ ప్రెసిడెంట్ మజ్జి వెంకటరావు, వైస్ ఎంపీపీ పాండ్రంగి శ్రీను, రాష్ట్ర, జిల్లా, నియోజకవర్గ అనుబంధ సంఘాల నాయకులు, సర్పంచ్‌లు, ఎంపీటీసీలు దోల ఆనంద్, బంక కృష్ణంనాయుడు, పాండ్రంగి అప్పారావు, చంద్రమౌళి, మరుపిల్ల చిన్నయపాత్రుడు, షిణగం దామోదరరావు, కోన శ్రీను, బంక శ్రీను, రౌతు శ్రీను, షిణగం ఎర్రయ్య, గీతల దేవుడు, చందక స్వామి, తొమురోతు రాము, తోణంగి అప్పలరెడ్డి గుసిడి ముత్యాలు, షిణగం అప్పలరాజు, కూరాకుల వెంకటేష్, పల్ల రమణ, నాగోతు మహేష్, బోని సన్యాసినాయుడు, షిణగం రాంబాబు, కోరాడ అప్పలస్వామినాయుడు, బలిరెడ్డి మహేష్, గంటా జగదీష్, చెన్నా సత్యం, ఇల్లపు వెంకటరావు తదితరులు పాల్గొన్నారు.

## క్లుప్తంగా

### 19 నుంచి అష్టలక్ష్మి ఆలయంలో పూజలు

కొమ్మాది: స్థానిక అన్నంరాజునగర్‌లోని అష్టలక్ష్మి దేవాలయంలో 19, 20 తేదీల్లో ప్రత్యేక పూజలు నిర్వహించనున్నట్లు ఆలయ ప్రధాన అర్చకులు చామర్తి శ్రీధర స్వామి తెలిపారు. 19న ఆదివారం ధన త్రయోదశి సందర్భంగా కరెన్సీ నోట్లతో ధనలక్ష్మి అమ్మవారిని అలంకరించి, అర్చిస్తామన్నారు. ధనలక్ష్మి హోమం, కుబేర హోమం నిర్వహించనున్నామని తెలిపారు. అదే విధంగా 20వ తేదీ సోమవారం దీపావళి సందర్భంగా ఆలయంలో కుంకుమార్చనలు, విశేష ధనలక్ష్మి పూజలు, అష్టలక్ష్మి హోమం నిర్వహించనున్నామని తెలియజేశారు.

### ఘనంగా గౌరమ్మ నిమజ్జనం


అమ్మవార్ల ప్రతిరూపాలైన వరి దుబ్బులను నిమజ్జనానికి తీసుకువెళ్తున్న గ్రామస్తులు

పద్మనాభం: మండలంలోని మద్దిలో గౌరమ్మ, పార్వతమ్మల నిమజ్జనం బుధవారం రాత్రి ఘనంగా జరిగింది. గ్రామంలో కనకల వారి ఇంట్లో ప్రతిష్ఠించిన గౌరమ్మ, పార్వతమ్మ ప్రతిరూపాలైన వరి దుబ్బులు, నంది విగ్రహాన్ని గ్రామంలో ఊరేగించిన అనంతరం రాజు–వెంకటపతి రాజు చెరువులో నిమజ్జనం చేశారు. కార్యక్రమంలో కనకల అప్పలరాజు, కనకల వారి కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

### ఘనంగా పైడితల్లమ్మ ఆలయ వార్షికోత్సవం


ఆలయం వద్ద వంక వారి కుటుంబ సభ్యులు

తగరపువలస: జీవీఎంసీ భీమిలి జోన్ రెండో వార్డు వలందపేట జాతీయరహదారిని ఆనుకుని ఉన్న పైడితల్లమ్మ ఆలయం 16వ వార్షికోత్సవం గురువారం జరిగింది. గ్రామానికి చెందిన వంక వెంకప్ప, రాములమ్మ దంపతుల కుటుంబ సభ్యులు అమ్మవారికి ప్రత్యేక అలంకరణ, పూజా కార్యక్రమాలు నిర్వహించారు. మధ్యాహ్నం ఆలయ ఆవరణలో భారీ అన్న సమారాధన నిర్వహించారు.

### చెకుముకి పోటీలతో శాస్త్రీయ దృక్పథం


ఆర్‌వీ పురం హైస్కూల్లో చెకుముకి పోటీల పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న నర్సారెడ్డి

పద్మనాభం: చెకుముకి పోటీలతో విద్యార్థుల్లో శాస్త్రీయ దృక్పథం పెంపొందుతుందని జన విజ్ఞాన వేదిక జిల్లా అధ్యక్షుడు నర్సారెడ్డి అన్నారు. మండలంలోని ఆర్‌వీ పురం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఎంఈవో పి.రమణతో కలిసి చెకుముకి పోటీల పోస్టర్‌ను గురువారం ఆయన ఆవిష్కరించారు. నర్సారెడ్డి మాట్లాడుతూ ఈ నెల 18న పాఠశాల స్థాయి, నవంబర్ ఒకటిన మండల స్థాయి, డిసెంబర్ 12 నుంచి 14 వరకు రాష్ట్రస్థాయిలో ఈ పోటీలు నిర్వహిస్తామన్నారు. ఉన్నత పాఠశాలలో ఎనిమిది నుంచి పదో తరగతి వరకు విద్యనభ్యసిస్తున్న విద్యార్థులు ఈ పోటీలకు అర్హులని తెలిపారు. కార్యక్రమంలో ఇన్‌చార్జి హెచ్ఎం కృష్ణారావు, మోడల్ ప్రైమరీ పాఠశాల హెచ్ఎం చిన్నారావు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

### విద్యార్థులకు నోట్ పుస్తకాల పంపిణీ


విద్యార్థులకు పుస్తకాలు అందిస్తున్న శేషాద్రి కుటుంబ సభ్యులు

తగరపువలస: ఆనందపురం మండలం గొట్టిపల్లి ఎంపీపీ మోడల్ స్కూల్‌కు చెందిన 70 మంది విద్యార్థులకు దుబాయ్‌కు చెందిన లక్కోజు శేషాద్రి కుమారుడు రిషిరామ గురువారం నోట్ పుస్తకాలు, స్నాక్స్ అందించారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయుడు గోవింద్‌కుమార్, మాజీ సర్పంచ్ కోరాడ నాయుడుబాబు, సత్యసాయి ఆదర్శగ్రామం కో–ఆర్డినేటర్ డబ్బీరు విజయకుమార్, కన్వీనర్ కోరాడ తమ్మునాయుడు తదితరులు పాల్గొన్నారు.

## గండిగుండంలో ఉచిత నేత్ర వైద్యశిబిరం


వృద్ధురాలికి కంటిపరీక్ష చేస్తున్న వైద్యురాలు

తగరపువలస: భగవాన్ సత్యసాయిబాబా శతజయంతి ఉత్సవాలలో భాగంగా ఆనందపురం మండలం గండిగుండంలో శంకర్ ఫౌండేషన్ కంటి ఆస్పత్రి, సత్యసాయి సేవా సంస్థల ఆధ్వర్యంలో గురువారం ఉచిత వైద్యశిబిరం నిర్వహించారు. శిబిరంలో 75 మందికి వైద్య పరీక్షలు నిర్వహించారు. శిబిరాన్ని ప్రారంభించిన వైఎస్సార్‌సీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి గంట్రెడ్డి శ్రీనివాస్ మాట్లాడుతూ పంచేంద్రియాల్లో కంటికి ఉన్న ప్రాధాన్యత గురించి తెలియచేశారు. పరీక్షలు చేయించుకున్న వారిలో 21 మందికి శస్త్ర చికిత్స అవసరమని గుర్తించారు. కార్యక్రమంలో శొంఠ్యాం పీఏసీఎస్ చైర్మన్ స్వామి నాయుడు, సత్యసాయి సేవా సంస్థల ప్రతినిధులు మానాపురం సత్యసాయికుమార్, బలిరెడ్డి పెంటయ్య, తోలేటి శర్మ, పి.శివప్రసాద్, బి.అప్పలరాజు, జి.రామకృష్ణ, జె.అప్పారావు, వై.పైడిరాజు పాల్గొన్నారు.

## టెన్త్ పరీక్షల్లో మెరుగైన ఫలితాలే లక్ష్యంగా..

- విద్యార్థుల ఇళ్లను సందర్శించిన ఉపాధ్యాయులు
- తల్లిదండ్రులకు సూచనలు


విద్యార్థినుల ఇళ్ల వద్ద చిట్టివలస జెడ్పీహైస్కూల్ ఉపాధ్యాయినులు


ఆర్‌వీ పురంలో విద్యార్థుల ప్రగతిని తల్లిదండ్రులకు తెలియజేస్తున్న ఉపాధ్యాయులు


బీసీ హాస్టల్‌లో విద్యార్థులతో మాట్లాడుతున్న ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు

తగరపువలస: పదో తరగతి పరీక్షల్లో మెరుగైన ఫలితాలే లక్ష్యంగా విద్యార్థులు చదవాలని చిట్టివలస జెడ్పీ బాలికల హైస్కూల్ ప్రధానోపాధ్యాయిని శివజ్యోతి సూచించారు. అందుకు అనువైన వాతావరణాన్ని ఇంట్లో కల్పించాలని విద్యార్థుల తల్లిదండ్రులను కోరారు. ఉపాధ్యాయుల గ్రామ సందర్శనలో భాగంగా ఉపాధ్యాయులతో కలసి ఆమె గురువారం సాయంత్రం పదో తరగతి విద్యార్థుల ఇళ్లను సందర్శించారు. ఇటీవల జరిగిన ఎఫ్ఏ–2 పరీక్షలలో విద్యార్థినులు సాధించిన మార్కులను వారి తల్లిదండ్రులకు తెలిపారు. రానున్న పరీక్షలలో మెరుగైన ఫలితాలు సాధించడానికి ఉపాధ్యాయులు అనుసరిస్తున్న వ్యూహాలను తెలియజేశారు. తల్లిదండ్రులు సహాయ సహకారాలు అందించాలని కోరారు.

- ఆనందపురం మండలం గొట్టిపల్లి జెడ్పీ హైస్కూల్ ఉపాధ్యాయులు గ్రామ సందర్శనలో భాగంగా విద్యార్థుల ఇళ్లను సందర్శించారు. మార్కులు, హాజరు శాతం గురించి తల్లిదండ్రులతో చర్చించారు.

**ఆర్‌వీ పురం, రెడ్డిపల్లి గ్రామాల్లో..**

పద్మనాభం: టెన్త్ పరీక్షల్లో విద్యార్థులు శతశాతం ఉత్తీర్ణత సాధించేందుకు మండల పరిధిలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలల ఉపాధ్యాయులు గ్రామసందర్శన నిర్వహించారు. అందులో భాగంగా ఆర్‌వీ పురం, రెడ్డిపల్లి గ్రామాల్లో పదో తరగతి విద్యార్థుల ఇళ్లను సందర్శించి, విద్యార్థుల ప్రగతిని వారి తల్లిదండ్రులకు తెలియజేశారు. ఎంఈవో పి.రమణ, హెచ్ఎంలు విజినిగిరి శంకరరావు, ఎంఎస్ఎస్ఎస్ఎస్ఎన్ మూర్తి, అబ్బూరి బాలామణి, బండారు అప్పలరాజు, శాంతి ప్రసూన, ఆర్‌వీ గిరి పాల్గొన్నారు.

**బీసీ బాలుర హాస్టల్ సందర్శన**

భీమునిపట్నం: విద్యార్థులందరూ బాగా చదువుకుని మంచి మార్కులతో ఉత్తీర్ణత సాధించాలని భీమిలి ప్రభుత్వ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయుడు పి.రమణ, నెర్రాలా ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయిని తిరుమల శ్రీదేవి, మున్సిపల్ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయిని భవాని సూచించారు. గ్రామసందర్శనలో భాగంగా వారు గురువారం సాయంత్రం భీమిలిలోని బీసీ బాలుర సంక్షేమ వసతి గృహాన్ని సందర్శించి, అక్కడ విద్యార్థులతో మాట్లాడారు. క్రమశిక్షణతో చదివి, మంచి మార్కులు తెచ్చుకోవాలన్నారు.

## పౌష్టికాహారంతోనే ఆరోగ్యవంతమైన శిశువుల జననం


గర్భిణులకు సీమంతం చేస్తున్న దృశ్యం

పద్మనాభం: పౌష్టికాహారం తీసుకుంటే ఆరోగ్యవంతమైన శిశువులు జన్మిస్తారని ఎంఈవో పి.రమణ అన్నారు. పద్మనాభంలోని వెలుగు కార్యాలయంలో గురువారం నిర్వహించిన పోషణ కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా సరఫరా చేస్తున్న పౌష్టికాహారాన్ని గర్భిణులు తినాలన్నారు. దీనిలో భాగంగా గర్భిణులకు సామూహిక సీమంతాలు చేశారు. భీమిలి ఐసీడీఎస్ ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో ఐసీడీఎస్ పీవో ఎం.శ్రీదేవి, మండల పరిషత్ ఏవో జయ ఉమ, జెడ్పీటీసీ మాజీ సభ్యుడు కె.దామోదరరావు, కృష్ణాపురం ఎంపీటీసీ సభ్యురాలు కె.లక్ష్మి, సూపర్ వైజర్లు ఎస్‌వీ పార్వతి, ఉన్నీషా బేగం, కె.రమణ, కె.నగేష్ కుమార్ అంగన్‌వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

## అప్పన్నకు ఆర్జిత సేవలు


స్వర్ణపుష్పాలను భక్తులతో తాకిస్తున్న అర్చకుడు

సింహాచలం: శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామికి గురువారం ఆర్జిత సేవలు వైభవంగా జరిగాయి. ఉదయం 7 గంటల నుంచి స్వర్ణపుష్పార్చనసేవను నిర్వహించారు. 108 స్వర్ణసంపెంగలతో స్వామికి అష్టోత్తర పూజ జరిపారు. ఉభయదాతలకు శేష వస్త్రాలు, ప్రసాదం అందించారు. ఆలయ సూపరింటెండెంట్ సత్యశ్రీనివాస్ ఏర్పాట్లు పర్యవేక్షించారు. ఉదయం 9.30 నుంచి నిత్యకల్యాణం వైభవంగా జరిగింది. ఉభయదాతలకు స్వామివారి అక్షింతలు, ప్రసాదం, శేషవస్త్రాలను అందించారు.

## సీపీఆర్‌పై అవగాహన



సీపీఆర్ ప్రతిజ్ఞ చేస్తున్న ఎన్ఆర్ఐ వైద్యులు

తగరపువలస: సంగివలస అనిల్ నీరుకొండ ఆస్పత్రిలో హృదయ పునరుద్ధరణ(సీపీఆర్)పై గురువారం అవగాహన కార్యక్రమం, ప్రపంచ అనస్థీషియా దినోత్సవం నిర్వహించారు. అనస్థీషియా వైద్యులు, సిబ్బంది సీపీఆర్ ఎలా చేయాలో చూపించి, గుండెపోటు వచ్చిన సందర్భాలలో తీసుకోవలసిన తక్షణ చర్యల గురించి వివరించారు. ఈ నెల 13 నుంచి 17 వరకు సీపీఆర్ అవగాహన వారంగా ఆరోగ్య, కుటుంబ సంక్షేమ మంత్రిత్వశాఖ ప్రకటించిన నేపథ్యంలో సీపీఆర్ ప్రతిజ్ఞ చేశారు. కార్యక్రమంలో అనస్థీషియా విభాగాధిపతి పద్మా అమర్ విశాల్, ఆస్పత్రి మెడికల్ డైరెక్టర్ చెంచురెడ్డి, సూపరింటెండెంట్ ప్రతిమాదేవి, ప్రిన్సిపాల్ భాగ్యలక్ష్మి, వైస్ ప్రిన్సిపాల్ కృష్ణ ప్రకాష్, నరేష్ తదితరులు పాల్గొన్నారు.

### నేటి నుంచి ఎస్‌జీఎఫ్ క్రీడా పోటీలు

తగరపువలస: ఆనందపురం జెడ్పీ హైస్కూల్లో శుక్ర, శనివారాలలో స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ అండర్–14, 17 విభాగాలలో బాలురు, బాలికలకు వేర్వేరుగా ఆటలపోటీలు నిర్వహించనున్నారు. 17న బాలురకు, 18న బాలికలకు కబడ్డీ, ఖోఖో, వాలీబాల్, బాడ్మింటన్, అథ్లెటిక్స్, చెస్, యోగా పోటీలు నిర్వహించనున్నారు. మండలంలోని అన్ని హైస్కూళ్ల నుంచి విద్యార్థులు ఈ పోటీలలో ఎలిజిబిలిటీ ఫారంతో తప్పకుండా హాజరు కావాలని నిర్వాహకులు కోరారు.

**పద్మనాభం మండలంలో..**

పద్మనాభం: మండల స్థాయి ఎస్‌జీఎఫ్ క్రీడా పోటీలు ఈ నెల 17, 18 తేదీల్లో నిర్వహించనున్నట్లు పాండ్రంగి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల హెచ్ఎం ఆర్‌వీ గిరి, మండల కో–ఆర్డినేటర్ ఎల్‌వీవీఆర్ సత్యం తెలిపారు. అండర్–14,17 విభాగాల్లో కబడ్డీ, ఖోఖో, వాలీబాల్, షటిల్ బ్యాడ్మింటన్, యోగా, చెస్, అథ్లెటిక్ విభాగాల్లో పోటీలు ఉంటాయన్నారు. బాలురకు పద్మనాభంలోని గోస్తని విద్యా పీఠ్, బాలికలకు కృష్ణాపురంలోని కస్తూర్బా విద్యాలయంలో ఈ పోటీలు నిర్వహించనున్నట్లు తెలిపారు. వివరాలకు 97047 37384 నంబర్‌లో సంప్రదించాలని కోరారు.

## విద్యార్థులకు దంత పరీక్షలు

తగరపువలస: చిట్టివలస శ్రీకృష్ణ డిగ్రీ కళాశాలకు చెందిన 150 మంది విద్యార్థులకు గురువారం సంగివలస అనిల్ నీరుకొండ దంత వైద్యశాల సిబ్బంది ఉచితంగా వైద్య సేవలు అందించారు. కార్యక్రమంలో కరస్పాండెంట్ బి.నరసింగరావు, ప్రిన్సిపాల్ జె.సతీష్, వైస్ ప్రిన్సిపాల్ కె.సింహాచలం పాల్గొన్నారు.

## వైభవంగా దామోదర దీపోత్సవం


కార్తీక దామోదరుని సన్నిధిలో నేతితో వెలిగించిన దీపాలు

తగరపువలస: ఆనందపురం మండలం గంభీరం ఐఐఎంవీ రోడ్డులోని హరేకృష్ణ వైకుంఠంలో దామోదర దీపోత్సవాలు కనులపండువగా జరుగుతున్నాయి. హరేకృష్ణ మూవ్‌మెంట్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన పూజల్లో భక్తులు పాల్గొని, దామోదరునికి నేతి దీపాలను వెలిగించారు. స్వామికి హారతి సమర్పించారు. నిష్కించిన భక్తదాస ప్రవచనాలు వినిపించారు. యదురాజ దాస మాట్లాడుతూ దామోదర వ్రతం నియమాలు తెలియజేశారు. అంబరీష దాస తదితరులు భక్తులకు ప్రసాదాలు పంపిణీ చేశారు.

## చిరు వ్యాపారుల ఆందోళన

**జీవీఎంసీ వాహనం అడ్డగింత**


జీవీఎంసీ వాహనానికి అడ్డంగా కూర్చున్న ఆందోళనకారులు

మధురవాడ: ప్రత్యామ్నాయ ఉపాధి చూపకుండా తమ బతుకులు కూల్చడం సరికాదని చిల్లర వర్తకులు, తోపుడు బండ్ల వ్యాపారులు ఆందోళన వ్యక్తం చేశారు. మధురవాడ మిథిలాపురి వుడా కాలనీలో రోడ్డు వెంబడి ఉన్న దుకాణాలను జీవీఎంసీ సిబ్బంది గతంలో కూల్చివేసిన సంగతి తెలిసిందే. అదే ప్రాంతంలో వీరు మళ్లీ దుకాణాలను ఏర్పాటు చేసుకునేందుకు ప్రయత్నించడంతో జీవీఎంసీ సిబ్బంది గురువారం ఆ సామగ్రిని తీసుకెళ్లే ప్రయత్నం చేయగా వ్యాపారులు అడ్డుకున్నారు. జీవీఎంసీ వాహనానికి అడ్డంగా కూర్చుని ఆందోళన చేపట్టారు. జీవీఎంసీ అధికారుల తీరుపై సీఐటీయూ అనుబంధ విశాఖ జిల్లా తోపుడుబళ్లు, చిల్లర వర్తక సంఘం ఆధ్వర్యంలో నిరసన తెలిపారు. సంఘం నాయకులు పి.రాజ్‌కుమార్, డి.అప్పలరాజు తదితరులు మాట్లాడుతూ ప్రత్యామ్నాయ ఉపాధి చూపేంతవరకు తోపుడుబండ్లు, దుకాణాలు ఉన్నచోటే వ్యాపారం చేసుకునేందుకు అవకాశమిస్తామని చెప్పిన అధికారులు, ఇప్పుడు ఆ సామగ్రిని తీసుకెళ్లిపోవడం సరికాదన్నారు. దీనిపై పోలీసులు, జీవీఎంసీ సిబ్బందితో వాగ్వాదానికి దిగారు. కార్యక్రమంలో పలువురు చిల్లర వర్తకులు, తోపుడు బండ్ల సంఘం నాయకులు పాల్గొన్నారు.

## మధురవాడలో ట్రాఫిక్ పద్మవ్యూహం

**మారికవలస జంక్షన్–క్రికెట్ స్టేడియం మధ్య నిత్యం ఇదే పరిస్థితి**


కార్‌షెడ్ వైపు ట్రాఫిక్ పరిస్థితి ఇదీ..


మధురవాడ వైపు వెళ్లే రోడ్డులో బారులు తీరిన వాహనాలు

మధురవాడ: మధురవాడ పరిసర ప్రాంతాల్లో ట్రాఫిక్ పద్మవ్యూహాన్ని తలపిస్తోంది. ఉదయం, సాయంత్రం వేళల్లో నిత్యం ఇదే పరిస్థితి నెలకొంటోంది. కొమ్మాది జంక్షన్ – క్రికెట్ స్టేడియం మధ్య పరిస్థితి దారుణంగా ఉంటోంది. మూడు సిగ్నల్స్ మధ్య వాహనాలు కలిసిపోయి, కనీసం కదలలేని స్థితిలో ఉంటున్నాయని వాహన చోదకులు అంటున్నారు. ఈ రెండు కిలోమీటర్లు దూరం వెళ్లడానికి కొన్ని సందర్భాల్లో అరగంట పైనే పడుతున్న పరిస్థితి. సాయంత్రం వేళల్లో ఇక చెప్పనవసరం లేదు. మధురవాడ పరిసర ప్రాంతవాసులు కార్లలో బయటకు వెళ్లడానికి సాహసించడం లేదంటే పరిస్థితి అర్థం చేసుకోవచ్చు. ట్రాఫిక్ సిబ్బంది ఉన్నా ఫలితం లేకపోతోందన్నారు. వారు చలానాలు విధించేందుకు ఫొటోలు తీయడానికి చూపిస్తున్న శ్రద్ధ, వాహనాల క్రమబద్ధీకరణపై చూపడంలేదని పలువురు ఆరోపిస్తున్నారు. ఉన్నత అధికారులు స్పందించి, చర్యలు చేపట్టాలని స్థానికులు, వాహనచోదకులు కోరుతున్నారు.

## ఇంకా లభించని శ్రీను ఆచూకీ

తగరపువలస: ఈ నెల 14న బాలాజీనగర్ గోస్తని నదిలో స్నానానికి దిగి గల్లంతైన తమ్మిన శ్రీను ఆచూకీ మూడోరోజైన గురువారం కూడా లభించలేదు. రెండోరోజు కూడా ఏపీఎస్‌డీఆర్ఎఫ్ బృందం గోస్తని నది మొత్తం గాలించినా ప్రయోజనం లేకుండా పోయింది. శుక్రవారం స్కూబా డైవింగ్ ద్వారా నదిలో గాలించనున్నారు.